క్లుప్తంగా

పీకేఓసీకి అవార్డు


ఉద్యోగులకు ప్రశంసా పత్రం అందిస్తున్న అధికారులు, కార్మిక నేతలు

మణుగూరుటౌన్: గత నాలుగేళ్లుగా కంపెనీ లెవల్‌లో బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు అందుకుంటున్న పీకేఓసీ.. 2024–25లోనూ కైవసం చేసుకుంది. దీంతో పీఓ లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో న్యూ సైట్ ఆఫీస్ వద్ద గురువారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. వర్షాల ప్రభావం కొంత వెనుకబడినప్పటికీ సమష్టి కృషితో లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమన్నారు. ఆపై పీఓ లక్ష్మీపతిగౌడ్ మాట్లాడారు. అనంతరం ఉత్పత్తిలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలతో పాటు స్వీట్, బహుమతులు అందించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, సీఎంఓఏ బ్రాంచ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వీరభద్రుడు, సురేశ్‌కుమార్, వెంకట రామారావు, శ్యాం సుందర్, అనురాధ, కుమార్ పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు


దొంతికుంట చెరువుకట్టను శుభ్రపరుస్తున్న సిబ్బంది

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువు కట్టను ఇరిగేషన్, మున్సిపాలిటీ సిబ్బంది రెండ్రోజులుగా శుభ్రం చేస్తున్నారు. చెరువు కట్టపై పిచ్చి చెట్లు పెరిగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ చెరువు కట్ట బహిరంగ మల విసర్జనకు కేంద్రంగా మారింది. బతుకమ్మ ఘాట్ సైతం చెత్తతో నిండిపోయింది. దీంతో ఇరిగేషన్ డీఈఈ కృష్ణ చెరువుకట్టను శుభ్రం చేయాలని మున్సిపాలిటీ సిబ్బంది సహకారం కోరినట్లు తెలిపారు. సెంటర్ లైటింగ్ పనులు జరుగుతున్నందున పట్టణ కేంద్రంలో ఆహ్లాద వాతావరణం కల్పించడం కోసం స్థానికుల సహకారంతో చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.

సంత వేలంపాట రసాభాస

బూర్గంపాడు: ప్రతి ఆదివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సారపాక వారపు సంత వేలంపాట రసాభాసగా మారింది. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలంపాట నిర్వహించగా.. అఖిల పక్ష నాయకుల అభ్యంతరాలతో వాయిదా పడింది. సంతను జాతీయ రహదారి పక్కన నిర్వహించవద్దని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అఖిల పక్ష నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. సంతను ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేనటువంటి ప్రాంతంలో నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. దీంతో అధికారులు సంత వేలంపాటను వాయిదా వేశారు.

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్


న్యాయమూర్తి వసంత్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తూ..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గురువారం భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కొత్తగూడెంలో కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోట దేవదానం, పూసాల శ్రీనివాసచారితో పాటు ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బార్ వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, కోశాధికారి పేరాల నాగరాజు, సంయుక్త కార్యదర్శి శారద పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టిపెట్టాలి

బూర్గంపాడు: ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, గుంటక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న పర్ణశాల

- సమీపిస్తున్న శ్రీరామనవమి
- ఈ ఏడాది భక్తుల రద్దీ పెరిగే అవకాశం
- ముమ్మర ఏర్పాట్లలో అధికారులు


నూతన రంగులతో అలంకరించిన ఆలయ ముఖద్వారం


విద్యుత్ లైట్ల వెలుగులో పర్ణశాల ఆలయం

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామాలయంలో ఈ నెల 6వ తేదీన జరిగే శ్రీరామనవమి వేడుకల కోసం ఆలయ, పంచాయతీ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. స్వామి వారి కల్యాణాన్ని కనులారా చూసేందుకు భక్తులు ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో రామనవమికి పర్ణశాలకు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు.

భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో..

కల్యాణం సమీపిస్తుండగా.. దేవస్థానం బాధ్యులు ఆలయంలో ఇప్పటికే ఆలయానికి సుందరంగా రంగులను వేశారు. ప్రధాన ఆలయం, గాలిగోపురం, ఉపాలయాలు, ప్రహరీ, పంచవటీ కుటీరంలకు వివిధ రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. పంచవటీ కుటీరంలో విగ్రహాలకూ నూతన రంగులతో సుందరంగా తయారు చేశారు. కల్యాణం జరిగే మండపంతో పాటు దేవాలయం ప్రాగణంలో క్లాత్ డెకరేషన్ పనులను చేపట్టారు. నవమి రోజున భద్రాచలం వచ్చిన ప్రతి భక్తుడూ ఆలయానికి వచ్చే అవకాశం ఉండటంతో దానికి అనుగుణంగా ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. భక్తులకు విక్రయించేందుకు దాదాపు 5వేల లడ్డూలను భద్రాచలం దేవస్థానం నుంచి పర్ణశాలకు తెప్పిస్తున్నారు. అలాగే భక్తులకు సరిపడా పులిహోర ప్రసాదాన్ని సిద్ధం చేయనున్నారు. పులిహోర 200గ్రా. రూ.15.లడ్డూ ధర రూ.25గా నిర్ణయించారు. అలాగే కళ్యాణ మండపం ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం 15 కూలర్లను ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

పంచాయతీ ఆధ్వర్యంలో..

శ్రీరామనవమికి పర్ణశాల పంచాయతీ ఆధ్వర్యంలో పనులను వేగవంతం చేశారు. రామాలయ ఆవరణలో జరిగే శ్రీ సీతారామచంద్రుల స్వామి కల్యాణం కోసం మండపం చుట్టూ పారిశుద్ధ్య పనులు చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పర్ణశాల గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి వాహనాలను పార్కింగ్ చేసేందుకు అనువుగా బ్లేడ్ ట్రాక్టర్‌తో చదునుచేస్తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను నాలుగు జోన్లుగా విభజించి దుమ్ముగూడెం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు 30మందికి మూడు రోజుల పాటు విధులు కేటాయించడంతో పాటు పారిశుద్ధ్య పనులకు దాదాపు 40 మంది కార్మికులను నియమిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు రెండు షిఫ్ట్‌ల్లో విధులను కేటాయించనున్నారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ పరిసరాల్లో, సీతమ్మ నార చీరల ప్రాంతంలో 4 తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శ్రీరామ నవమికి పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, గోదావరి నదీ ప్రాంతాన్ని శుభ్రపరిచి భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను ఏర్పాటు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా..



శ్రీరామనవమి పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించి పర్ణశాలకు వచ్చే ప్రతి ఒక్క భక్తుడు స్వామి వారి కళ్యాణం కనులారా తిలకించేలా తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుంది కళ్యాణం అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుంది.

– అనిల్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జ్

జాతర ముగిసే.. పారిశుద్ధ్యం మరిచే!


ఆలయం సమీపంలోని వ్యర్థాలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద గత నెల 27వ తేదీ నుంచి 31 వరకు వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ జాతర ఉత్సవాలకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి దాదాపు రెండు లక్షల మంది భక్తులు తరలిరాగా, ఐదు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలతో ఆలయ పరిసరాలు చెత్తాచెదారంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆలయం పరిసరాల్లో ఎటు చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, భోజనం ప్లేట్లు, గ్లాసులు నిండుకున్నాయి. వీటిని శుభ్రం చేయడానికి ఇప్పటివరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నది లేదు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లించలేదు. దీనిపై ఆలయ ఈఓ సూర్యప్రకాశ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. శుక్రవారం నుంచి ఆలయ పరిసరాలను శుభ్రం చేయిస్తామని, కార్మికులు అందుబాటులో లేక ఆలస్యమైందని తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే


జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండలంలో గురువాం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత గొల్లగూడెం గ్రామంలో సుమారు 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామంలోని గ్రామంలో రేషన్ దుకాణంలో ఉచిత సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. అలాగే పలు గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు సుమారు రూ.29లక్షల 03వేల 364 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం చొప్పాల, తుమ్మలగూడెం, అనంతారం, పద్మాపురం గ్రామాలలో నూతన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమాల్లో కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు పోలబోయిన శ్రీవాణి, ఎర్ర సురేష్, రాందాస్, జలగం కృష్ణ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష..

పినపాక: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. వేసవికాలం నేపథ్యంలో మండలంలోని నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని పంచాయతీల్లో నీటి సమస్య పరిష్కారం కోసం మండలానికి ప్రత్యేకంగా కలెక్టర్ నిధుల నుంచి 13 లక్షల 30 వేల రూపాయలు మంజూరు చేశామని, తద్వారా నీటి సమస్య లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారీ తాతారావు, ఎంపీడీఓ సునీల్, తహసీల్దార్ నగేష్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు ఇతర అధికారుల పాల్గొన్నారు.

పర్ణశాలలో గరుడాధివాసం


ఆలయంలో గరుడపటంతో అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడాధివాసం కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఉత్సవాల్లో ఇదే ప్రధాన ఘట్టం అని అర్చకులు వివరించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, అర్చకులు ప్రతాపురం భార్గవాచార్యులు, కారంపూడి కిరణ్‌కుమారాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, రాజగోపాలచార్యులు, నరసింహాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజం మేలు కోరే వారే క్రైస్తవులు

మణుగూరుటౌన్: క్రైస్తవులు సమాజ మేలు కోరే వ్యక్తులని బిషప్ జె.స్టీవెన్, పాస్టర్ జాన్ వెస్లీలు అన్నారు. గురువారం మండలంలోని సమితిసింగారం పంచాయతీలోని సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో హౌస్ ఆఫ్ హోప్ మినిస్ట్రీస్ తరుపున గ్రాడ్యుయేషన్, ఆర్డినేషన్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరికి ఏ సమస్య వచ్చినా వారి కోసం ప్రత్యేక ప్రార్థన చేసే క్రైస్తవులపై దాడులు చేయడం సరికాదని అన్నారు.

పెద్దిపల్లిలో హెల్త్‌క్యాంప్

మణుగూరుటౌన్: వలస ఆదివాసీ గ్రామమైన పెద్దిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వివిధ వ్యాధుల బాధితులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వారి రక్తన మూనాలు సేకరించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి దోమ తెరలు వినియోగించాలని సూచించారు. పరంగిని, రాంప్రసాద్, కృష్ణ, శైలజ పాల్గొన్నారు.

సమక్క-సారలమ్మ జాతర

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని తిరుమలకుంట గ్రామ శివారులోని సమక్క-సారలమ్మ ఆలయం వద్ద గురువారం జాతర ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని నైవేథ్యాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కుడా గ్రామ దేవతలను దర్శించుకున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అర్చకులు విఘ్నేశ్వర పూజలు చేయగా.. అభయాంజనేయస్వామి వారి విగ్రహనికి మహిళలు అభిషేకాలు చేసి పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు మనుగొండ సత్యనారాయ, సంగా శ్రీనివాసరావు, వేముల నాగేశ్వరరావు, పేరం నాగు, భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో గురువారం చలివేంద్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఆలయ అధ్యక్షుడు కొమ్మనాపల్లి ఆదినారాయణ, కురిచేటి శ్రీనివాసరావు, కొమ్మనపల్లి వెంకటరమణ, గొర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ములకలపల్లి: మాధారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఊకంటి మధుసూదన్‌రావు బీజేపీలో చేరారు. కొత్తగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు అనుమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మధుసూధన్‌కు కండువా కప్పి సాదరంగా బీజేపీలోకి ఆహ్వానించారు. జీవీకే, మనోహర్, కుంజా ధర్మ, మధుసూధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

మణుగూరులో కార్డెన్ సెర్చ్


మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పక్కన సీఐలు

మణుగూరుటౌన్: పట్టణంలోని చికెన్, మటన్, చేపల మార్కెట్ ఏరియాల్లో ఉన్న ఇళ్లల్లో మణుగూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులను ఆధార్ కార్డులతో సహా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా స్థానికులతో సమావేశమైన డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ, భద్రతా భావం కల్పించడం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం(కార్డన్ సెర్చ్)లు అని, యువత గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచితులు, కొత్త వ్యక్తులు పదే పదే తిరుగుతున్నా, గంజాయి రవాణాపై సమాచారం ఉన్నా సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కార్డెన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 34 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తరలించారు. సంబంధిత పత్రాలను చూపి వాహనదారులు తమ వాహనాలను తీసుకెళ్లగా.. నాలుగు ద్విచక్ర వాహనాలు మాత్రం పోలీసుల ఆధీనంలోనే ఉన్నాయి. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఏడూళ్లబయ్యారం ఎస్‌హెచ్‌ఓ రాజ్‌కుమార్, మణుగూరు ఎస్‌ఐ మేడ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం


లబ్ధిదారుడి నుంచి వేలిముద్ర తీసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. పేదప్రజలకు పోష్టకాహారం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యాన్ని పేదప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ అశోక్‌కుమార్, సివిల్ సప్లై డీటీ రాజులు, సీఐ అశోక్, ఆర్‌ఐ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చర్ల: చర్ల మండలంలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షదీముబారక్ చెక్కులను 39 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సన్న బియ్యం పంపిణీని ప్రారంబించారు. తహసీల్దార్ శ్రీనివాస్, సహకార సంఘ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీను, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల సందర్శన


వ్యవసాయ కళాశాలలోని పంటలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

అశ్వారావుపేట: మండల కేంద్రం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలను వైరా, ఎర్రుపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థినులు గురువారం సందర్శించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, సిబ్బంది కళాశాలలో బోధన, సాగవుతున్న పంటలను విద్యార్థులకు వివరించారు. కళాశాలలో సాగవుతున్న కొబ్బరి తోటలో అంతర పంటలు, మొక్కజొన్న, జొన్న, ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల తోటల సాగును వివరించారు. కళాశాల బోధనా సిబ్బంది డాక్టర్ దీపక్‌రెడ్డి, డాక్టర్ చరిత, డాక్టర్ లక్ష్మణ్, తేజస్విని పంటల సాగు వివరించారు. డాక్టర్ కె.నాగాంజలి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ నీలిమ, డాక్టర్ శిరీష బోధనా పద్ధతులు, ఏఈఎల్‌పీ, కళాశాల అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినుల వెంట గురుకుల పాఠశాలల ఉపాధ్యాయినులు ఉన్నారు.

కేంద్ర నిర్ణయం సింగరేణికి ప్రమాదకరం


మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

మణుగూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ బొగ్గు బ్లాకులు సింగరేణికి ఇవ్వడానికి నిరాకరణతో సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి పీవీకాలనీ కెఎల్ మహేంద్ర భవన్ ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఈపీ ఆపరేటర్ల జనరల్ బాడీ సమావేశం బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌తోపాటు బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్ మాట్లాడుతూ.. కార్మికులను విచ్ఛిన్నం చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏఐటీయూసీ ఎప్పుడూ కార్మికుల పక్షమే ఉంటుందని అన్నారు. సమావేశంలో పుల్లారావు, ఆదర్ల సురేందర్, ఆవుల నాగరాజు, బి.సురేందర్, రాజశేఖర్, శనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాశ్, రవిశరత్, కృష్ణ పాపారావు, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు


చెట్టును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

బూర్గంపాడు: బూర్గంపాడు–భద్రాచలం రాష్ట్రీయ రహదారిపై పాత గొమ్మూరు వద్ద ఎండిన చెట్టు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గురువారం సాయంత్రం వీచిన పెద్దగాలికి ఎండిన చెట్టు రోడ్డుపై పడిపోయింది. దీంతో అటుగా వస్తున్న వాహనాలు నిలిచిపోయాయి. స్థానికులు, నాగినేనిప్రోలు గ్రామపంచాయతీ అధికారులు రోడ్డుపై ఉన్న కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. చెట్టు పడిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది.

హమాలీలకు సరిపడా పని కల్పించాలి

దమ్మపేట: గతంలో మాదిరిగా సరిపడా పనిని కల్పించాలని, గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న హమాలీలు, జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్ త్రినాథ్ బాబును కోరారు. గురువారం మండల కేంద్రం దమ్మపేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డును సందర్శించిన త్రినాథ్‌ను.. జీసీసీ హమాలీలు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎగుమతి దిగుమతులకు సంబంధించిన కూలి రేట్లను ఏమాత్రం తగ్గించకుండా యథావిధిగా కొనసాగించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు పిట్టల అర్జున్ హమాలీ నాయకులు భోగి సత్యం, కొప్పుల శ్రీను, వీర్రాజు, ప్రసాదు, మారేషు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం భద్రాచలం వెళ్తున్న రామభక్తుల బృందానికి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఏపీలోని ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి కాలినడకన శ్రీరామ నవమి వేడుకకు తరలి వెళ్తున్న దాదాపు మూడు వేల మంది భక్తులకు స్థానిక విశ్వహిందూ పరిషత్, పెరిక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంకత ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంకత మల్లికార్జునరావు, లోకం సాంబశివరావు, మల్లంపల్లి సత్యనారాయణ, దంతనపల్లి రఘురాంబాబు, లోకం అశ్విన్ పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించండి

మణుగూరుటౌన్: సమితిసింగారంతోపాటు ఇతర గ్రామ పంచాయతీల్లోని ఉపాధి హామీ కూలీలు కిలోమీటర్ల మేర వెళ్లి పనిచేయాల్సి వస్తోందని, వారి సమస్య పరిష్కరించాలని సీపీఎం మణుగూరు మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కూనవరం, రేగులగండి గ్రామాల్లో ఉపాధి కూలీలు 5కిలోమీటర్ల మేర దాటి కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో పిట్టల నాగమణి, వెంకట్రావు, హేమంతరావు, వెంకట నారాయణ, రమా లక్ష్మి తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసన


అశ్వారావుపేట: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భుముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులు, ప్రొఫెసర్లపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం హేయమైన చర్య అన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు పలుచోట్ల నిరసన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూనివర్సిటీ భూముల కోసం ఉద్యమిస్తున్న వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం, గూండాగిరిని ప్రదర్శిస్తోందని విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్


చంద్రుగొండ: అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన..


దుమ్ముగూడెం: రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు